రాజారాంపురంలో పిక్నిక్ సందడి

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో రాజారాంపురం సముద్ర తీరంలో ఆదివారం యాత్రికులతో పిక్నిక్ సందడి నెలకొంది. కార్తీకమాసంలో మూడో వారం కావడంతో భక్తులు, కుటుంబ సభ్యులు సమేతంగా వచ్చి వనభోజనాలు ఆచరించి సముద్ర తీరంలో స్నానాలు చేసి పిల్లా పాపలతో ఆనందంగా గడిపారు. సందర్శలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా

సముద్ర తీరంలో పహారా కాస్తున్న పోలీసులు

ఎస్ఐ జి.రంజిత్ ఆధ్వర్యాన పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు.

'అపార్' కష్టాలు

- అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు
- కార్డు జారీకి సరిపోలని విద్యార్థుల వ్యక్తిగత వివరాలు
- తలలు పట్టుకుంటున్న ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు
- ఆధార్ కేంద్రాలు, సచివాలయాల చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణలు

కేంద్ర ప్రభుత్వం ఒకే నేషన్.. ఒకే ఐడిలో భాగంగా ఒకటి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికీ ఒక నంబరును కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ నంబరుని తయారు చేయడానికి క్షేత్రస్థాయిలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.

ప్రజాశక్తి- రణస్థలం

సంక్షేమ పథకంలో భాగంగా అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో ప్రతి విద్యార్థికీ ఆన్‌లైన్‌లో ఒక నంబరును కేటాయిస్తారు. ఈ నంబరు వల్ల భవిష్యత్‌లో సదరు విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు ఆ నంబర్లను పొందుపర్చా ఉంటాయి. ఇది జరగాలంటే మూడు రకాల రికార్డుల్లో ఒకే సమాచారం... ఒకే రకంగా ఉంటేనే సాధ్యం అవుతుంది. విద్యార్థి ఒకటో తరగతి చేరినప్పుడు అడ్మిషన్ రిజిస్టర్, ఉపాధ్యాయుడు ఆన్‌లైన్ చేసిన వివరాలు, ఆధార్ కార్డు ఈ మూడింట్లో ఏ చిన్న తప్పు లేకుండా ఒకే రకంగా ఉంటేనే అపార్ నంబరు సులభంగా జారీ అవుతుంది. లేకుంటే అపార్ నంబరు జారీ కాదు. ఇలా చాలామంది విద్యార్థులకు సంబంధించి ఏదో ఒక దాంట్లో ఏదో ఒక తప్పిదం తల్లిదండ్రులు తమ పనులన్నీ వదులుకుని ఆధార్ కేంద్రాలు, సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

అపార్ నమోదు పక్రియను పరిశీలిస్తున్న ఎంఇఒ లావణ్య (ఫైల్)

ప్రస్తుతం పదో తరగతికి సంబంధించి...

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన నామినల్ రోల్స్ పంపాల్సి ఉంది. ఓవైపు సర్వర్ సమస్యలు, మరోవైపు తీవ్ర ఒత్తిడి. ఈ రెండింటి మధ్య సిఆర్‌పిలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ఒకటో తరగతిలో చేరే సమయంలో ఇంటి పేరు (సర్నేం)తో నమోదు చేసుకుంటారు. సదరు ఉపాధ్యాయులు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆధార్ కార్డు తయారీ సమయంలో ఇంటి పేరు లేకుండా కేవలం ఒక అక్షరం (ఇనిషియల్)తో నమోదు చేశారు. అలాగే పుట్టిన తేదీ ఏదో ఒకటి వేసేశారు. ప్రస్తుతం ఈ రెండే ఆ ప్రస్తుతం ఈ రెండే ఆ పిల్లలకు ప్రధాన సమస్యలుగా మారాయి. ఆధార్‌లో మార్పులు జరగాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. అయితే చాలామంది పిల్లల కుటుంబాల్లో ఆ నమోదు జరగలేదు. ఇప్పుడు చేయించడానికి కార్యాలయాల చుట్టూ ప్రదర్శనలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ మార్పులు అంతసులభంగా అయ్యేవి కావు. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 11,816 మంది విద్యార్థులు, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో 23,498 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1,915 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 45,018 మంది, 315 యుపి పాఠశాలల్లో 22,569 మంది, 419 ఉన్నత పాఠశాలల్లో 79,497 మంది, ప్రయివేటు పాఠశాలల్లో 78 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం అందిన వివరాల మేరకు ఒక్కో పాఠశాలలో కేవలం 30 నుంచి 40 మంది విద్యార్థుల వివరాలు మాత్రమే అపార్‌లో నమోదయ్యాయి. జిల్లా అధికారులు ఈ పక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేయడంతో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

జిల్లాలో 402 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

సివిల్ సప్లయి డిఎం శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పంటను విక్రయించేందుకు జిల్లాలో 402 కొనుగోలు కేంద్రాలును ఏర్పాటు చేశామని సివిల్ సప్లయి డిఎం కె.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ జెడి త్రినాథరావులు అన్నారు. స్థానిక పిఎసిఎస్ కార్యాలయం వద్ద మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ అధ్యక్షతన ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫులో 3,60,000 ఎకరాల్లో 2,90,000 మంది రైతులు వరి సాగు చేశారని అన్నారు. వీటి ద్వారా 4,90,000 క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 80 కేజీల ధాన్యం బస్తాను రూ.1840లు గిట్టుబాటు ధర కల్పించామన్నారు. అయితే రైతులు ధాన్యం నూర్చిన తరువాత అరబెట్టి మిల్లులకు తీసుకువెళ్లాలని, మిల్లర్లు కూడా ధాన్యం కొనుగోలు చేసిన 15 రోజుల్లో మిల్లింగ్ చేసి ఎఫ్‌సికి పంపించాలని అన్నారు. గతంలో కాకుండా గోని సంచులు, రవాణా ఛార్జీలు రైతులు భరించుకోవాలని, రైతులకు నచ్చిన రైస్ మిల్లుకు తమ ధాన్యం తీసుకెళ్లవచ్చునని అన్నారు. ధాన్యం మిల్లుకు తీసుకువెళ్లిన ఆరు గంటల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే 48 గంటల్లో మీ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, డిఎస్‌ఒ జి.సూర్యప్రకాశరావు, డిసిఒ నగేష్, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, జిఎం జగదీష్, బిఆర్ బి.మురళీకృష్ణ, టిడిపి నాయకులు బోయిన రమేష్, కర్రి అప్పారావు, నంబాళ శ్రీనివాసరావు, పట్ట సింహాచలం పాల్గొన్నారు.

జట్టు కళాసీలకు సమగ్ర చట్టం చేయాలి

- పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలి
- సిఐటియు జిల్లా నాయకులు వి.జె.కె మూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జట్టు కళాసీలకు, హమాలీలకు సమగ్ర చట్టం అవసరమని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని సిఐటియు నాయకులు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జె.కె.మూర్తి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జట్టు కళాసీ హమాలీ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా మహాసభలు ఆదివారం నగరంలోని టౌన్ హాల్ సమీపాన గల కళ్యాణ మండపంలో నిర్వహించారు. ముందుగా డైమండ్ పార్కు నుంచి ఏడు రోడ్లు కూడలి, పాత బస్టాండ్ వరకు మహాప్రదర్శన చేపట్టారు. తప్పెటగుళ్లు, డప్పు వాయిద్యాలతో పాటు కళారూపాలు, ప్రజానాట్య మండలి కళాకారులు శ్రీనివాసులు, రామచంద్రరావు ఆటాపాటలతో అలరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, కళాసీ సంఘం జిల్లా అధ్యక్షులు కె.సూరయ్య సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం హాల్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షులు బొల్ల చిన్నారావు అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జట్టు, ముఠా కళాసీ కార్మికులు అత్యంత దుర్భర పరిస్థితుల్లో బతుకీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ, జట్టు, ముఠా, కళాసీ కార్మికులకు పనిభద్రత, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలన్నారు. సమగ్ర చట్టం అమలు కోసం వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు పెరిగిన ధరల కనుగుణంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాదం సంభవించి అంగవైకల్యం పొందినా, ప్రాణాలు కోల్పోయినా పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక బరువులు మోయడం, పని గంటలు లేకపోవడం వల్ల వయసు పైబడక ముందే కీళ్ల రోగాలు, నడుము నొప్పుల బారిన పడటం, చిన్న వయసులోని ఆరోగ్య సమస్యలకు లోనవుతున్నారన్నారు. పోరాటాలు ఫలితంగా 2011 మార్చి నుంచి ఈ తీర్మానాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ప్రభుత్వ శాఖల పరిధిలో మాత్రమే 50 కిలోల బ్యాగులు వస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల క్రితం నిర్ణయించినా ఇప్పటికీ ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో అమలకు నోచుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా ముఠా కార్మికులు సంక్షేమానికి కేటాయించడం లేదన్నారు. సమావేశంలో కళాసీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సూరయ్య నివేదిక ప్రవేశ పెట్టారు. హమాలీ, ముఠా, కళాసీ కార్మికులు సంఘటితంగా పోరాడాలన్నారు. మహసభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కో-కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, ఎన్.బలరాం, డి.మహా లక్ష్మి, డి.సూరి, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న కళాసీలు

నూతన కమిటీ ఎన్నిక

జట్టు కళాసీ, హమాళి కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులుగా కె.సూరయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.చిన్నారావు, ఆర్.ప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా డి.మహాలక్ష్మి, వల్లభరావు, సహాయ కార్యదర్శులుగా కె.లక్ష్మీనారాయణ, డి.సింహాచలం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.సూరి, కోశాధికారిగా పి.అప్పలరాజు, కమిటీ భ్యులుగా వి.సింహాచలం, ఎల్.పకీరు, ఇ.అప్పారావు, బి.అప్పారావు, ఎ.సతీష్, కె.అప్పన్న, బి.సూరి, ఎ.నర్సయ్య, టి.సుబ్బయ్య, మీనారావు, బి.రామారావు, పోలారావు, రమణ, బి.సహదేవ్, రమేష్, ఎల్.చంద్రయ్య, జోగారావు, తోణంగి. మహేష్, పి.తేజేశ్వరరావు, ఎ.బాబూరావు, వీరయ్య, టి.సూర్యనారాయణ ఎన్నికయ్యారు.

విజయగౌరిని గెలిపిద్దాం

ప్రజాశక్తి- టెక్కలి

పిడిఎఫ్ తరుపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న కోరడ్ల విజయగౌరిని గెలిపించుకుందామని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో మండలశాఖ అధ్యక్షులు పడాల గణపతి అధ్యక్షతన మండల స్థాయి సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై తమ వాణిని వినిపించే విజయగౌరి విజయం ఆవశ్యమని అన్నారు. జిల్లాశాఖ సహాధ్యక్షులు కురమాన దాలయ్య, జిల్లా కార్యదర్శి బాలక శంకరరావులు మాట్లాడుతూ ఈ నెల 24, 25 తేదీల్లో మందస మండలం హరిపురంలో నిర్వహించనున్న యుటిఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు స్పందించిన తీరుపై అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, పాలవలస ధర్మారావు, డొంకాన పాపారావు, బమ్మిడి ఆరుణకుమార్, మారం కుమారస్వామి, ఎస్.ఎస్.సత్యనారాయణ, ఎన్.కృష్ణారావు, బి.చిన్నవాడు, సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మండల, మున్సిపల్ కేంద్రాల్లో

పిజిఆర్ఎస్ వికేంద్రీకరణ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా ఉన్న 30 మండల కేంద్రాలతో పాటు శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో ప్రతి సోమవారం ఇకపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యయ ప్రయాసల కోర్చి ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా ఫిర్యాదు దారులు తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరచుకోవాలన్నారు.

స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

కంచిలి : మండల కేంద్రంలోని కంచిలి రైల్వేస్టేషన్‌లో ఎస్ఐ పారినాయుడు ఆధ్వర్యాన ఆదివారం పోలీస్ సిబ్బంది జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి రవాణా అరికట్టేందుకు ఎస్‌పి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సామగ్రిని తనిఖీ చేశారు. ఒడిశా నుంచి గంజాయి రవాణా జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల రాకపోకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోంపేట సిఐ మంగరాజు పర్యవేక్షణలో సిబ్బందితో కలిసి ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి, నాటు సారా అక్రమ రవాణాపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు.

జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ పారినాయుడు

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- హిరమండలం/పాతపట్నం

మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. హిరమండలం మండలం నౌగూడలో గిరిజన మత్స్యకారులకు ఉచితంగా ఫింగర్ లెవల్ చేప పిల్లలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ మేరకు చెరువులో చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 169 మత్స్యకార గిరిజన చెరువులకు ఉచితంగా వంద శాతం సబ్సిడీపై చేప పిల్లల పంపిణీ, అలాగే 90 శాతం సబ్సిడీపై మత్స్యకారులకు పనిముట్లు అందజేశామని చెప్పారు. మత్స్యకారులను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమీకృత మత్స్య అభివృద్ధి పథకం చేపట్టిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారికి చేపల పెంపకం ద్వారా జీవనోపాధి లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ ఆఫీసర్ పి.వి.శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్, ఎంపిడిఒ కాళీప్రసాద్, ఎంపిపి తూలుగు తిరుపతిరావు పాల్గొన్నారు.

చేప పిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

పంచారామాలకు ప్రత్యేక బస్సులు



జెండా ఊపి ప్రారంభిస్తున్న మేనేజర్ అమరసింహుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పంచారామాలకు వెళ్లే ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మలు ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రం నుంచి పంచారామాల ప్రత్యేక బస్సులు బయల్దేరుతాయని తెలిపారు. ఈ సర్వీసులో టిక్కెట్లు బుక్ చేసుకున్న వారికి పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని శివాలయాల సందర్శన ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9959225608, 9959225609, 9959225610, 9959225611 సెల్ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1,2 డిపో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, టెక్కలి అసిస్టెంట్ మేనేజర్ పి.ఎస్.ఎన్.మూర్తి, శ్రీను, ప్రసాద్, ఎం.పి.రావు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ చట్టం అమలుకు చర్యలు

- క్రమం తప్పకుండా సదరం ధ్రువీకరణ
- నకిలీ వికలాంగుల పత్రాలపై విచారణ
- వికలాంగుల సంక్షేమశాఖ ఎడి కవిత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వికలాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు వికలాంగుల శాఖ పూర్తి సహకారాన్ని అందిస్తోందని వికలాంగుల సంక్షేశాఖ ఎడి కె.కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని డచ్ భవనం వద్ద డిసెంబరు 3న వికలాంగుల క్రీడలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వికలాంగులు సైతం మానవ వనరుల్లో అంతర్భాగమేని పేర్కొన్నారు. వారికి అండగా నిలిచేందుకు జిల్లాలో వికలాంగుల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వికలాంగులు, హిజ్రాలకు ప్రత్యేక శిబిరాల ద్వారా నిరంతరాయంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాల వారీగా అర్హులైన వికలాంగులకు అవసరమైన ఉపకరణాలు అందిస్తున్నామన్నారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ద్వారా పెద్దఎత్తున ఏటా ట్రై సైకిళ్లు, ఇతర పనిముట్లు అందిస్తున్నామని అన్నారు. సదరం గుర్తింపు ధ్రువీకరణ ప్రక్రియను కొనసాగుతోందని తెలిపారు. నకిలీ ధ్రువపత్రాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో విచారణ కొనసాగుతోందన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న క్రీడలు, వికలాంగులకు అందిస్తున్న సౌకర్యాలు ఇతర అంశాలపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు ఎలా సాగుతున్నాయి?

జిల్లా వ్యాప్తంగా అంగవైకల్యంతో బాధపడుతున్న వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపే ఆలోచనతో ప్రభుత్వం డిసెంబరు 3న వికలాంగుల సంక్షేమశాఖ అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ నెల 20న జిల్లాస్థాయిలో వికలాంగులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నాం. జిల్లా కేంద్రంలోని డచ్ బంగ్లా మైదానంలో క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న ఈ పోటీల్లో కేటగిరీల వారిగా స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహించనున్నాం. గతంలో ఆర్ట్స్ కళాశాల, కెఆర్ స్టేడియం పరిసరాల్లో వీటిని నిర్వహించేవారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచన మేరకు ఆహ్లాదకరమైన వాతావరణంలో డచ్ బంగ్లా మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నాం.

? జిల్లాలో వికలాంగుల సంక్షేమానికి అందిస్తున్న చర్యలేంటి?

ప్రధానంగా అంగవైకల్యం ఉన్న వారు మానసికంగా, దృఢంగా ఉండేలా మనోధైర్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నాం. అందులో భాగంగా బదిరులు, చెవిటి, మూగ, అంధులు, చేతులు, కాళ్ల అంగ వైకల్యంతో బాధపడుతున్న వారిని గుర్తించాం. చెవిటి వారిని వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి గ్రామంలో గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాం. ఈ సర్వే ఆధారంగా జిల్లాలో 36 వేల మంది వరకు వికలాంగులు ఉన్నారని గుర్తించాం. వారిలో అవసరమున్న వారికి గతంలో పరికరాలు అందించాం.

? టచ్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు ఎంత మేరకు ఇచ్చారు?

జిల్లాలో సుమారు 12 వందల మంది వరకు బదిరులు ఉన్నట్టు గుర్తించాం. వారిలో చెవుడు, మూగ ఉన్న బదిరులు, ఒక్క మూగ వారు ఉన్నారు. వారిలో వివిధ తరగతుల్లో చదవుకున్న వారు ఉన్నారు. గతంలో వీరికి చదువుకునేందుకు అవకాశాలు తక్కువగా ఉండేవి. బదిరుల పాఠశాలలు అందుబాటులోకి వచ్చిన తర్వాత చదువుకున్న వారి సంఖ్య పెరిగింది. వీరిలో జ్ఞాపక శక్తి అధికంగా ఉంటుంది. సాంకేతిక వినియోగించడంలో కూడా వీరు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. చదువుకున్న వారికి మరింత సాంకేతికంగా చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అందులో భాగంగా 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు ఉన్న బదిరులందరికీ టచ్‌ఫోన్లు, లాప్‌ట్యాప్‌లు ఇస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న 18 నుంచి 40 ఏళ్ల లోపు వయసు కలిగి పదో తరగతి, ఆపై తరగతులు చదువుతున్న విద్యార్థులతో పాటు చదువు పూర్తి చేసిన బదిరులకు వీటిని అందజేస్తున్నాం. అవసరమున్న వారు ధ్రువపత్రాలను ఆన్‌లైన్ ద్వారా apdascac.ap.gov.in అనే వెబ సైట్‌లో నమోదు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునే బదిరులు మెడికల్ బోర్డు నుంచి పొందిన సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, తెల్ల రేషన్‌కార్డు, ప్రభుత్వ ఆడియోలజిస్టు నుంచి పొందిన సైన్ లాంగ్వేజ్ ధ్రువపత్రం, పదో తరగతి, ఆపై తరగతులు చదువుకున్న ధ్రువపత్రాలతో దరఖాస్తులతో పాటు అప్‌లోడ్ చేస్తే వాటిని పరిశీలించిన అర్హులకు ఫోన్లు ఇస్తున్నాం.

? నకిలీ పత్రాలపై ఇటీవల వస్తున్న ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల మొదలు, పింఛను వరకు వికలాంగుల ధ్రువీకరణపై కొన్ని ఫిర్యాదులు ఉన్నాయి. వాటిపై శాఖాపరంగా విచారణ చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిని మళ్లీ మెడికల్ బోర్డుకు పంపిస్తాం. అందులో భాగంగా మెడికల్ బోర్డు విచారణ చేపట్టి నివేదికలు అందించి మేరకు చర్యలు తీసుకుంటాం.

? బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ఏమేరకు చేపడుతున్నారు?

ప్రభుత్వ శాఖల్లో వికలాంగులకు రిజర్వు చేయబడిన ఉద్యోగాల్లో ఖాళీలను బట్టి ఆరు నెలలకొక మారు బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించాం. అంగవైకల్యం ఉండి విద్యార్హత ఉన్న వారికి మాత్రమే ఈ ఖాళీల్లో నియమించడానికి వీలవుతుంది. జిల్లాస్థాయిలో ఎంపిక కమిటీ పర్యవేక్షణలో నియామకాలు చేపడుతున్నాం. అయితే ప్రస్తుతం ఖాళీలను గుర్తించడానికి వీలుగా ప్రభుత్వ శాఖల వారీగా జాబితాలను తయారు చేయాలని కలెక్టర్ నుంచి ఆదేశాలున్నాయి. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఖాళీలను గుర్తించాం. రిజర్వేషన్, రోస్టర్ విధానంలో ఎంపిక చేపడతాం. ఖాళీలను భర్తీ చేయడానికి ముందుగా నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఈ నియామకాలు డిఎస్‌సి పరిశీలనలో జరుగుతాయి.

నోటీస్

మహారాజశ్రీ రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 59/2024 in O.S. 288/2023

Between

1. నల్లమిల్లి సూర్రెడ్డి ... డిగ్రీ హోల్డర్

మరియు

కంటుభుక్త శ్రీనివాసరావు ... జడ్జిమెంట్ డెటార్

To

JDr. : కంటుభుక్త శ్రీనివాసరావు

S/o.నాగేశ్వరరావు, వయస్సు 39 సం॥లు, హిందూ, అంబులెన్స్ డ్రైవర్, O/o D.M.H.O. ఆఫీస్, శ్రీకాకుళం, శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం J.C.J.C.

డిక్రీ హోల్డరు దాఖలు చేసుకున్న పై నెంబరు E.P.లో మీకు శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు నోటీసులు పంపినను ఉద్దేశ్య పూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయు చున్నందున మీ హాజరు నిమిత్తం **ది. 20-11-2024 సం.రం తేదీన** పై కోర్టునందు **ఉదయం 10.30 ని.లకు** మీరు స్వయంగా గాని, మీ ప్లీడరుగారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు ఏమైనా ఉన్నయెడల శ్రీ కోర్టువారికి తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

రామచంద్రపురం 15-11-2024

కె.లోవరాజు, జి. మల్లేశ్వరరావు
అడ్వకేట్స్, రామచంద్రపురం

విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కేళీ వరి విత్తనాలు సరఫరా చేసి రైతులను నష్టపరిచే విత్తన సంస్థలపై చట్ట రీత్యా చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఆనందరావు, యస్.చంద్రయ్యలు డిమాండ్ చేశారు. రైతు ఎస్.రామయ్యతో కలసి నగరంపల్లి, పెద్దబడం గ్రామాల్లో వరి పొలాల్లో కేళీలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణ రకం ప్రభుత్వ సరఫరా చేసే విత్తనాల్లో పెద్ద ఎత్తున కేళీలు కనిపిస్తున్నాయని అన్నారు. 20 రోజులు క్రితం వచ్చినా ఎన్ను (కంకీలు)బాగా పండి భూమికి చేరింది అన్నారు. మరికొంత కంకులు పక్కాకి వస్తున్నాయని అన్నారు. మొదటి వచ్చిన పంటను కోయడంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఈ నష్టాన్ని కంపెనీ సంస్థల నుంచి వసూలు చేసి రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం మండల ఎఒ దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు పరిశీలించకపోవడం సరికాదన్నారు. జిల్లా వ్యవసాయాధికారులు పరిశీలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట ఎన్.మోహనరావు ఉన్నారు.

కేళీని పరిశీలిస్తున్న ఆనందరావు

విచారణ చేపడుతున్న తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

ఉపాధ్యాయురాలు ఆత్మహత్యపై విచారణ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని ఈదురాపల్లిలో అత్తవారింట ఆత్మహత్యకు పాల్పడిన ఉపాధ్యాయురాలు శాసనపురి నవ్య కేసుపై తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి ఆదివారం విచారణ చేపట్టారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అత్తమామలు, ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్తులు, భర్త నుంచి మొత్తం వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ మొత్తం వీడియో రికార్డింగ్ చేశారు. ఆత్మహత్య వ్యవహారంపై ఎవరికైనా అనుమానాలు ఉంటే తెలియజేయాలని తహశీల్దార్ వారిని కోరారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సంఘటన స్థలానికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు చేరుకొని నివాళ్లర్పించారు. సిఐ టి.మోహనరావు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికైన సభ్యులతో స్టేషన్ మాస్టర్

నూతన కన్సల్టింగ్ కమిటీ ఎన్నిక

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం రైల్వే స్టేషన్ నూతన కన్సల్టింగ్ కమిటీ సభ్యులుగా ఎంద శ్రీనివాసరావు, చింతల మల్లేశ్వరరావు, ఎన్. రాజ్ కుమార్, ఎస్.తేజారావు, బి.అర్జునరావు ఎన్నియ్యారని రైల్వే స్టేషన్ ఇన్స్పెక్టర్ గనేష్ ట్రోఫ్ తెలిపారు. రైల్వే స్టేషన్లో ఆదివారం సమావేశంలో నిర్వహించారు. కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు జిల్లా ఒబిసి మోర్చ జనరల్ సెక్రెటరి ఎంద శ్రీనివాసరావు, జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రెటరి చింతల మల్లేశ్వరరావు, ఎస్సీ మోర్చా రాజ్ కుమార్, స్టేషన్ మాస్టర్ శ్రీనివాసరావు, ముద్దాడ ధర్మారావు, గోవింద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా దాడులు

దుర్గాప్రసాద్, ఎక్సైజ్ సిఐ

ఇచ్ఛాపురం: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఇచ్ఛాపురం మున్సిపల్ పరిధిలోని, కవిటి మండలంలోని అక్రమ మద్యం అమ్మకాలు, రవాణాపై ముమ్మరంగా దాడులు చేపట్టనున్నట్లు ఎక్సైజ్ సిఐ పి. దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 11 నుంచి 17 నిర్వహించిన దాడుల్లో ఎనిమిది కేసులు నమోదయ్యాయన్నారు. ఈ దాడుల్లో ఒడిశాకు చెందిన 88 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పాత కేసుల్లో నిందితులను ఇచ్ఛాపురం, కవిటి మండల తహశీల్దార్ల వద్ద బైండోవర్ కేసులు నమోదు చేయించామన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

మందస: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి డొక్కరి దానయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల సమావేశం సాదాసీదాగా సాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలు అవుతున్నా... ఇప్పటి వరకు రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు హామీలు అమలు కాలేదని, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో చాలా మందికి డబ్బులు జమ కాలేదని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని మూడు పిహెచ్సిలు ఉన్నా... ఉద్దాన ప్రాంత ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదని వివరించారు. సిసి రోడ్లు, డ్రైనేజ్ పనులు నాసిరకంగా నిర్మిస్తున్నారని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పైల సూర్యనారాయణ, తహశీల్దార్ హైమావతి వైస్ ఎంపిపి సిర ప్రసాద్, జెడ్పిటిసి సవర చంద్రమ్మ పాల్గొన్నారు.

అరసవల్లికి పెరిగిన రద్దీ

శ్రీకాకుళం అర్బన్: కార్తీకమాసం మూడో ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ పెరిగింది. ఉచిత సందర్శకులకు 2 గంటల సమయం పట్టింది. దీంతో ఆదివారం ఒక్కరోజే స్వామి వారి ఆదాయం రూ.9 లక్షల వరకు వచ్చిందని ఆలయ ఇఒ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. టికెట్లు విక్రయాల ద్వారా రూ.4,21,200, విరాళాల రూపంలో రూ.1,66,572, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,12,090 ఆదాయం సమకూరినట్టు ఆయన తెలిపారు.

గ్రంథాలయాల్లో కవితా దినోత్సవం

లావేరు : మాట్లాడుతున్న కుమార్ రాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం కవితా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాహితీవేత్త, పూర్వపు సెట్శ్రీ సిఇఒ సురంగి మోహనరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు యువత వచ్చే విధంగా రచయితలు, కవులు ఆసక్తికరమైన రచనలను అందించాలన్నారు. కవితా దినోత్సవంలో భాగంగా కవిసమ్మేళనం వేమన కవితాంశం అధ్యక్షులు మహ్మద్ రఫీ (ఈవేమన) నిర్వహించారు. సుమారు 20 మంది లబ్ద ప్రతిష్ట కవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రరియన్ శంకరరావు, సీనియర్ కవి గుడిమెట్ల గోపాలకృష్ణ హాస్యం, వ్యంగ్యంతో కూడిన మినీ కవితలతో అలరించారు. కె.వి.రాజారావు సందేశాత్మక కవిత వినిపించగా వావిలపల్లి రాజారావు, ఉమాకవి, కె.శ్రీని వాసరావు సంతోష్, ఐఎన్డి. ప్రసాదరావు, చోడవరపు ఈశ్వర్ కవితలు వినిపించారు. ఉప్పు త్రినాదరావు, మజ్జి మోహనరావు గ్రంథాలయంపై గేయాలు పాడి అందర్ని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వాడాడ శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్ట్ ఇంద్రాల శరత్ బాబు గేయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కవులను కుమార్ రాజు దుశ్శాలువలతో సత్కరించారు.

లావేరు : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా లావేరు శాఖ గ్రంథాలయంలో కవి సమ్మేళన జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ రచయిత ఈ వేమన, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు పాల్గొని కవులు గోపాలరావు, టి.వైకుంఠరావు, ఎస్ వి.కె. రాజాచార్యులు, పివిజె గుప్త, బి.రామకృష్ణ, జి.గోవిందరావు, ఎమ్. చంద్రశేఖరరావులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి. వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని బొడ్డేపల్లి పేటలో ఉన్న శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు ఆర్.శ్రీను సమక్షంలో జరిగాయి. కార్యక్రమంలో సహాయకులు జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : గ్రంథాలయ శాఖలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించాలని జిల్లా పెన్షన్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తమరి వైకుంఠరావు ప్రకటనలో డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో మందులు ఖర్చులు, ఇంటికి సామగ్రి కొనుగోలుకు సిబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా ఆలస్యంగా పెన్షన్ వేయడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం చిత్రలేఖన పోటీలను గ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖగేశ్వరరావు, ధర్మారావు, శ్వేత, భారతి, నీలిమ, గిరిజారాణి, పండు, ధనుష పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక శాఖాగ్రంథాలయంలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 'విద్యార్థుల భవిషత్'. పైసెల్ ఫోన్ ప్రభావంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బాలిక హైస్కూల్, మోడల్ స్కూల్, స్వర్ణభారతి హైస్కూల్ నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఆశి గౌరీశంకర్‌రెడ్డి, రవిశంకర్

ఆమదాలవలస : క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మెళియాపుట్టి : చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్ : రాజారావు మాస్టర్‌కు సన్మానిస్తున్న కుమార్‌రాజు

మహాపాత్రో వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి పూర్ణ చంద్రబెహరా ఆధ్వర్యాన వారోత్సవాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో జాని, సత్యనారాయణ బెహరా పాల్గొన్నారు.

పాతపట్నం : స్థానిక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 11 స్కూళ్ల నుంచి 68 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కాళ్ల రాజు, ఎండోమెంట్ విశ్రాంత ఇఒ డకరా రమణమూర్తి, సింగపురం మురళి, పిట్టా వెంకటరావు పాల్గొన్నారు.

పలాస :కాశీబుగ్గ శాఖ గ్రంథాయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను కె.యుగంధర్, పి.స్వప్న నిర్వహించారు. ఈ పోటీలో ప్రథమ బహుమతి పి.సునీత, ద్వితీయ బహుమతి ఆర్.స్వప్న, తృతీయ బహుమతి ఎన్.మోహనరావు పొందారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై. రాంబాబు, పాఠకుడు హేమంత్, బాలకృష్ణ, పద్మ, పి.వైష్ణవి పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయంలో ప్రభుత్వ, విజ్ఞాన భారతి, మహర్షి ప్రయివేటు పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి టి.ఇందిర, సిబ్బంది డి.లక్ష్మి పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక శాఖాగ్రంథాలయంలో విద్యార్థుల చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఆంగ్ల ఉపాధ్యాయులు నంబూరు భాస్కరరావు, గ్రంథాలయాధి బి.రూపావతి, సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.

నేడు ఆశావర్కర్ల ధర్నా

శ్రీకాకుళం అర్బన్ : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారానికి, ప్రభుత్వ ఒప్పంద జిఒలను వెంటనే అమలు చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ... ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, అధ్యక్ష, కార్యదర్శులు ధనలక్ష్మి, అమరావతిలు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశ కార్యకర్తలంతా ఈ ధర్నాకు తరలిరావాలని పిలుపు నిచ్చారు.

మహిళా సంఘాలకు శిక్షణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్వయంశక్తి సంఘాల ఇన్కమ్ ప్రొఫైల్ ఆఫ్ ద్వారా సంఘల వారీగా డేట సేకరించాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. మహిళా సంఘ భవనంలో మహిళా సంఘాల సభ్యులకు ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా పేదల సమస్యలను ఏర్పాటు చేసి వివిధ పేదరిక నిర్మూలన కార్యక్రమాలను చేపట్టామని అన్నారు. కంచిలి మండలంలో స్వయం శక్తి సంఘాలు 36 గ్రామ సంఘాల సభ్యులు మండల మహిళా సమైక్యలుగా ఏర్పడ్డారని అన్నారు. గ్రూపు సభ్యుల కుటుంబాలకు విద్య, ఉపాధి, సమగ్ర సమాచారం ఇన్కమ్ ప్రొఫైలింగ్ యాప్ ద్వారా సిబ్బంది, విఎఎలు, మండలస్థాయిలో సమంగ్రా పూర్తి చేస్తామని అన్నారు.

బాలియాత్రలో పాల్గొన్న తమ్మినేని, కూన రవికుమార్

శ్రీముఖలింగంలో బాలి యాత్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వంశధార నదీతీరాన గల శ్రీముఖలింగంలో ఆదివారం బాలి యాత్ర వైభవంగా నిర్వహించారు. వంశధార నదికి ప్రత్యేక హారతులు అందజేశారు. ఈవేడుకల్లో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్, వైసిపి నాయకులు పేడాడ తిలక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశధార నదిలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఒడిశాలోని గజపతిలు, విజయనగరం రాజులు తమ పరిపాలన కాలంలో శ్రీముఖలింగాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దారని అన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

పలాస : వజ్రపు కొత్తూరు మండలం మంచి నీళ్లపేటలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య జరిగిన దాడిలో పలువురు గాయపడి పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆస్పత్రికి వెళ్లి వైసిపికి చెందిన క్షతగాత్రులను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మంచినీళ్లపేట పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే గౌతు శిరీషను నిలదీశారనే కక్షతో వైసిపి కార్యకర్తలపై దాడులకు దిగారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసిపి నాయకులపై దాడులు చేస్తున్నారని అన్నారు.

అండర్ పాసేజ్ వంతెనకు మరమ్మతులు

పలాస: మండలంలోని కిష్టుపురం రైల్వే అండర్ పాసేజ్ వంతెనకు రైల్వే అధికారులు మరమ్మతు పనులు ఆదివారం ప్రారంభించారు. అండర్ పాసేజ్ రోడ్డు అధ్వానంగా తయారైందని, చిన్నపాటి వర్షం కురిస్తే వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అండర్ పాసేజ్ వంతెనకు మరమ్మతులు చేపడుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 26 వరకు పనులు చేపడతామని, అప్పటి వరకు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. రైల్వే అండర్ పాసేజ్ సమస్యను కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లడంతో రైల్వే అధికారులు పనులు ప్రారంభించారని అన్నారు.

పనులను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వాట్సాప్ వేదికగా ఆ బాల్య స్నేహితులు 43 ఏళ్ల తర్వాత మరొక్కసారి ఒక్కటయ్యారు. ఒకరినొకరు చూసుకున్న ఆనందంలో తబ్బుబ్బయి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కేరింతలు వేస్తూ... పలు ఆటలు ఆడుతూ ఆనందించారు. శ్రీకాకుళం నగరంలోని నందమూరి తారకరామారావు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1980-81లో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వాడాడ తరణికృష్ణ స్మార ధార్మిక సేవా ట్రస్టు భవనంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. తొలిత నవంబరు నెలలో పుట్టిన వారితో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తమతో కలిసి చదువు కున్న బాల్య స్నేహితురాలు సుందరి మృతికి రెండు నిముషాలు మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పొందూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1975-76 పదోతరగతి, 1976-78 ఇంటర్ చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 48 ఏళ్ల తర్వాత వీరంతా ఒకచోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో తమకు భౌతికశాస్త్రాన్ని బోధించిన డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖరరావు దంపతులకు సన్మానం చేశారు.

'ఉపాధి' పనులపై సర్పంచ్‌లకు చెప్పరా?

మెళియాపుట్టి: పంచాయతీల్లో చేపడుతున్న ఉపాధి హామీ, అభివృద్ధి పనులపై సర్పంచ్‌లకు తెలియకపోవడం ఏమిటని పలువురు సర్పంచ్‌లు నిలదీశారు. ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయంలో ఎంపిపి రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ ఉపాధి పనులు తమకు తెలియపర్చకుండా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీనిపై ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా జోక్యం చేసుకుని భవిష్యత్‌లో ఇలా జరగకుండా చూస్తామన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్‌లు జమ్మయ్య, తాడేల రామరాజు, చిట్టి కోరారు. అపార్ కార్డుకు సంబంధించి ఆధార్ సవరణలకు అందరూ ప్రోత్సహించి వేగవంతమయ్యేలా చూడాలని నాయకులను ఎంఇఒ ఎస్.దేవందరరావు కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్ వ్యవసాయ శాఖ ఎఒ ఎస్.దానకర్ణుడు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

పోలాకి: మండలంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామని ఎస్ఐ జి.రంజిత్ అన్నారు. పోలాకి నుంచి పిన్నింటిపేట రోడ్డులో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని, దానిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మౌగిల్లుపేట నుంచి ఆస్పత్రి కూడలి వరకు రోడ్డుకిరువైపులా ఉన్న రెల్ల పొదలను, ముళ్లచెట్లను ప్రొక్లెయి నర్‌తో తొలగించారు. దీంతో వాహన చోదకులు, ప్రజలు ఆనందంవ్యక్తం చేశారు.

పొదలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వంశీకృష్ణ మృతదేహం

ఇచ్ఛాపురం పట్టణంలో హర్ష మోటర్స్ వద్ద ఆదివారం రాత్రి లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరొకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పట్టణానికి చెందిన ఇద్దరు బావాబావమరుదులు ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ఇచ్ఛాపురం బైక్‌పై వస్తున్నారు. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో వంశీకృష్ణ (23) కృష్ణ గాయపడ్డాడు. స్థానికులు 108లో స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... వంశీకృష్ణ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తీవ్రంగా గాయపడిన కృష్ణను బరంపురం ఆస్పత్రికి రిఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

కోటబొమ్మాళి: మండలం హరిశ్చంద్రపురం రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి మండలం తొలుసురుపల్లికి చెందిన శిష్టి ప్రసాదరావుకు గాయాలయ్యాయి. తన ఇంటికి వచ్చిన కుమార్తె మౌనికను అమె అత్తవారింటికి రహమాన్‌పురానికి ద్విచక్రవాహనంపై తీసుకువెళుండగా హరిశ్చంద్రపురం రోడ్డులో జాతీయ రహదారి సమీపంలో ఒక మలుపు వద్ద ఎదురుగా వస్తున్న టాటా ఎసి ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదంలో గాయపడ్డ తన తండ్రి ప్రసాదరావును తొలుత స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ వి.సత్యన్నారాయణ తెలిపారు.

అడవిపిల్లి దాడిలో ఆవు మృతి

ప్రజాశక్తి- సోంపేట


మృతి చెందిన ఆవు

మండలంలోని మామిడిపల్లికి చెందిన కర్రీ నరేంద్ర అనే రైతుకు చెందిన ఆవును శనివారం అర్ధరాత్రి అడవి పిల్లి దాడి చేసి చంపింది. ఇంటి సమీపంలోని తోటలో ఆవును కట్టి ఉంచాడు. ఆదివారం వేకుజామున చూసేసరికి అడవి పిల్లి దాడికి గురై మృతి చెందింది.

'చలో శ్రీకాకుళం' పోస్టర్ ఆవిష్కరణ

టెక్కలి రూరల్ : ఈ నెల 29న అంబేడ్కర్ భవనంలో నిర్వహించనున్న ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ చలో శ్రీకాకుళం పోస్టర్‌ను ఎస్ వర్గీకరణ పోరాట సమితి నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ రోజు ఉదయం ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొకర నారాయణ, చల్ల రామరావు, ఆట్ల రాహుల్‌కుమార్, కె.కామేశ్వరరావు, దాలయ్య, తారక్, గడ్డయ్య, జర్జాన బాబూరావు, లోకనాథం, సంజీవ రావు, చిన్నవాడు, చంద్రశేఖర్, కసవయ్య, సూర్య నారాయణ, శ్రీనివాస్, పీస దామోదర్ పాల్గొన్నారు.

సోంపేట : సభ్యత్వ నమోదు చేస్తున్న టిడిపి నాయకులు

విస్తృతంగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- సారవకోట

మండలంలోని తోగిరి, నౌతల, క్యాలవలస, బుడితి, చీడిపూడి,జమాచక్రం తదితర గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ ఆదివారం సభ్యతత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురవరపు తిరుపతిరావు, మండల ప్రధాన కార్యదర్శి ఇస్సాయి నాగరాజు, శిమ్మ రామకృష్ణ, తండ్యాల సింహాచలం, సురేష్ పాల్గొన్నారు.

సోంపేట : టిడిపి సభ్యత నమోదు వేగవంతం చేద్దామని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సూరాడ చంద్రమోహన్, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కొర్లాంలో ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సాన షణ్ముఖరావు, వెదుళ్ల హరికృష్ణ, రామ్‌బుడ్డి జానకిరావు, రత్నాల వెంకటరమణ, మడ్డు రవికుమార్, బిన్నాల జగన్నాథరావు, మడ్డు రాజారావు, వాసుపల్లి కృష్ణారావు, సిహెచ్.ధర్మారావు పాల్గొన్నారు.

గోవిందపురంలో అన్నదానం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గోవిందపురంలో ఆదివారం రెండు వేల మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పూండి- గోవిందపురంలో కొంచాడ గోవిందరావు, కుటుంబ సభ్యులు రూ.30 లక్షలతో నిర్మించిన సత్యసాయి బాబా మందిరం ప్రారంభోత్సవం, పున:ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు పాలిన శ్రావణి, గోవిందరావు దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొంచాడ ధర్మారావు, వెంకటరావు, నూకరాజు దంపతులు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, సర్పంచ్ పాలిన రమ్య, చిరంజీవి పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడికి నివాళి

శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న స్వాతి

కోటబొమ్మాళి : సిఎం నారా చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు మృతి బాధాకరం అని, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నానని మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మండల నాయకులతో కలిసి స్థానిక ఎన్‌టిఆర్ కార్యాలయంలో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రి అప్పరావు, పూజారి శైలజ, దేవాది సింహాద్రమ్మ, లాడి శ్రీనివాస్, నంబాళ శ్రీనివాస్, పట్ట సింహాచలం, కోరాడ గోవింద తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : సిఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు మృతి దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి శంకర్, చిన్నారావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: సిఎం చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామూర్తి నాయుడు మృతికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే కుమారుడు తేజ ఆధ్వర్యంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో లంక శ్యామలరావు, ఆనందరావు, పిన్నింటి బానోజీ నాయుడు, పిసిని జగన్నాథం నాయుడు, టంకాల మౌళీశ్వరరావు, ఇనపకుర్తి తోటయ్య దొర తదితరులు పాల్గొన్నారు.

పోలాకి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు పోలాకిలో ఆదివారం టిడిపి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, భైరి భాస్కరరావు, లుకలాపు రాంబాబు, పి.రాంబాబు, సనపల నారాయణరావు, కామిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం : మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హిరమండలం ఎంపిపి తూలుగు తిరుపతిరావు, సర్పంచ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పలాస : మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, లోడగల కామేశ్వరరావు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, వంకల మాధవరావు, అనిల్ శర్మ, రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

పలాస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

ప్రజాశక్తి- కవిటి

శిథిలావస్థకు చేరుకున్న ట్యాంక్

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు పలువురు అధికారులు. కవిటి మండలం బైరెడ్లపుట్టుగ గ్రామంలోని మంచినీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడమే కాకుండా గ్రామానికి మంచినీటి సరఫరా కూడా నిలిచిపోయింది. ముఖ్యంగా గత రెండేళ్లుగా ట్యాంకు శుభ్రం చేయకపోవడంతో మంచినీరు వెళ్లాల్సిన వాలు మూసుకుపోవడంతో ట్యాంక్ శుభ్రం చేసే వాల్ ద్వారా నీటిని ట్యాంకులోకి పంపిస్తున్నారు. పంపించిన నీరు పైపులైన్లు పాడవ్వడంతో వృథాగా తోటలోకి పోతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సమీపంలో నివసిస్తున్న వారు, గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ గ్రామానికి చేరుకుని మంచినీటి ట్యాంక్ పరిశీలించారు. ప్రస్తుతానికి ఇబ్బంది లేదని మరమ్మతులు చేస్తే సరిపోతుందని అన్నారు. తక్షణమే మరమ్మతులు చేసి గ్రామానికి నీటిని అందించాలని జెఇ వంశీని ఆదేశించారు. ఇది జరిగి నేటికీ నెల రోజులు గడిచింది. మరమ్మతులు లేదు కదా కనీసం గ్రామస్తులకు నీరు కూడా అందడం లేదు. దీంతో నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదేశాలకే స్పందన లేనప్పుడు సామాన్యుడి పరిస్థితి ఏమిటని స్థానికులు వాపోతున్నారు.

భయం భయంగా ఉంటున్నాం

ట్యాంకు సమీపంలోనే మేం నివసిస్తున్నాము. ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడమే కాకుండా ముక్కలు కూడా ఊడిపోతోంది. అక్కడే మా పిల్లలతో పాటు గ్రామానికి చెందిన పిల్లలు కూడా ఆటలు ఆడుతుంటారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం భయంగా గడుపుతున్నాం. అధికారులు ఏం కాదులే అన్నట్టు మాట్లాడుతున్నారు. మరమ్మతులు చేసి గ్రామానికి మంచినీరు అందిస్తామన్నారు. ఇది జరిగి నెల రోజులు గడిచింది. ఇప్పటి వరకూ ఇటువైపు ఎవరూ చూడలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా భయం పోయేలా ట్యాంకు మరమతులు చేసి, గ్రామానికి మంచినీరు అందిస్తారని ఆశిస్తున్నాం.

– బర్ల లక్ష్మి, బైరెడ్లపుట్టుగ